సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 26 । మార్చి । 2024



సోమశిలలో 10.690 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 10.690 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2,180 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.68,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,150
3శాతం జీఎస్టీతో	రూ.6,335
నవర (8గ్రాములు)	రూ.50,680

గరిష్టం/కనిష్టం
36.6 /25.8

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 61 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం	బుధవారం
6:26	4:53

అన్నదాత మోము కళకళ



రైతు పొలంలో బోరు వేసేందుకు డ్రిల్లింగ్ చేస్తున్న యంత్రం (ఫైల్)

‘వైఎస్సార్ జలకళ’తో మెట్ట ప్రాంతాల్లో జలసిరులు

- నన్నకారు రైతుల పొలాల్లో బోర్లు
- జిల్లా వ్యాప్తంగా 2,480 బోర్ల ఏర్పాటు
- మెట్ట ప్రాంత కర్షకులు ఖుషీఖుషీ

ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పల్లె పల్లెను పలకరిస్తూ పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మెట్ట ప్రాంత రైతులు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. వారి కష్టాలను తొలగించాలనే లక్ష్యంతో ఉచిత బోర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించి సన్నకారు రైతుల పొలాల్లో ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేసేలా చర్యలు చేపట్టారు. తద్వారా పంటలు పండించుకునే అవకాశం లభించడంతో మెట్ట ప్రాంత రైతుల ఆనందానికి అవధులు లేవు.

పొదలకూరు: వైఎస్సార్ జలకళ పథకం పంట పొలాల్లో జలసిరులు కురిపిస్తోంది. ఈ పథకం ద్వారా మెట్ట ప్రాంతాల్లోని పొలాల్లో బోర్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఫలితంగా పైర్లకు నీటి తడులు అంది అధిక దిగుబడులు వస్తుండడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో 2020 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు 2,480 బోర్లను సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాను 5 క్లస్టర్లుగా విభజించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బోర్లు మంజూరు చేసి నిర్మాణంలో వేగాన్ని పెంచారు.

నాపూరుపల్లిలోనే 36 బోర్లు

పొదలకూరు మండలంలోని నాపూరుపల్లి పంచాయతీలోనే 36 బోర్లు మంజూరు కాగా, అన్నింటి నిర్మాణం చేపట్టారు. ఇక్కడ 30 బోర్లలో నీళ్లు బాగా పడ్డాయని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు నుంచి మూడు ఇంచ్‌ల నీరు పడడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ప్రభుత్వం బోరు వేయడంతోపాటు మోటార్, విద్యుత్ సౌకర్యాన్నీ కల్పించింది. కందుకూరు క్లస్టర్ పరిధిలోకి వచ్చే కావలి మండలంలో సైతం బోర్ల నిర్మాణంలో వేగం పెరిగింది.



నీటి లభ్యతపై జియాలజిస్ట్ పరిశీలన (ఫైల్)

అర్హత ఇలా..

వైఎస్సార్ జలకళ పథకానికి అర్హులు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని తమ పొలాల్లో ఉచితంగా బోర్లను నిర్మించుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనే సుమారు 500 బోర్ల వరకు వేశారు. ఐదెకరాల్లోపు మెట్ట రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. మాగాణి భూముల్లో ఉచిత బోర్లను నిర్మించరు. దరఖాస్తు చేసుకున్నాక ప్రాధాన్యతా క్రమంలో రైతుల తోటలు, పొలాల్లో బోర్లను నిర్మిస్తారు. దీనికి సంబంధించి ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. కేసింగ్ పైపులతో సహా బోర్లను నిర్మిస్తారు. సుమారు 350 అడుగుల వరకు డ్రిల్లింగ్ చేయడం ఈ పథకం ప్రత్యేకత. విద్యుత్ సౌకర్యం ఉంటే మోటార్‌ను ప్రభుత్వమే ఉచితంగా అందజేయడంతోపాటు కంపెనీ వారే వచ్చి బిగించి వెళ్తారు. జిల్లాలో ఇప్పటికి 50 వరకు విద్యుత్ మోటార్లు మంజూరయ్యాయి.

మెట్ట రైతులకు వరం

ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులకు వైఎస్సార్ జలకళ పథకం వరంగా మారింది. పొదలకూరు, కలువాయి, చేజర్ల, రాపూరు, సైదాపురం, మనుబోలు, వెంకటాచలం, ఆత్మకూరు, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు తదితర మెట్ట మండలాల్లో నిమ్మ, చీనీ, జామాయిల్, సవక పంటలను విస్తారంగా సాగు చేస్తారు. ప్రభుత్వం ఉచితంగా నిర్మించే జలకళ బోర్లతో మెట్ట పొలాలకు నీరు లభిస్తోంది. వాస్తవానికి రైతులు సొంత నిధులతో బోరు నిర్మించాలంటే రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చవుతుంది. మోటార్, విద్యుత్ సౌకర్యంతో కలిపి ఈ మొత్తం రూ.4 లక్షల వరకు అవుతుంది. కాగా ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హామీని నెరవేర్చిన సీఎం



రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకున్నారు. జలకళ పథకం ద్వారా బోర్లను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వేగంగా వేయించారు. బోర్ల కారణంగా నిమ్మ రైతులు లబ్ధి పొందారు. భారీగా ఖర్చు చేసి బోర్లు వేయించుకోలేని రైతులకు జలకళ పథకం ఎంతో ప్రయోజనకరం.

– నోటి రామలింగారెడ్డి, రైతు, దేగపూడి

పేద రైతులకు వరం



వైఎస్సార్ జలకళ పథకం పేద రైతులకు వరంగా మారింది. సర్వేపల్లి నియోజకవర్గంలో బోర్లను పెద్ద ఎత్తున నిర్మించారు. పొదలకూరు మండలంలో మంత్రి కాకాణి సహకారంతో రైతుల పొలాల్లో చాలా బోర్లు వేశారు. మోటార్లను సైతం ఉచితంగా అందజేస్తామన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకొని బోరు పొందవచ్చు.

– పెంచలనారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

నమ్మకద్రోహులను చిత్తుగా ఓడించాలి

- ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నమ్మకద్రోహులను చిత్తుగా ఓడించాలని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని 7వ డివిజన్‌లో నగర నియోజకవర్గ అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ గతంలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వ్యక్తిని రాజ్యసభ సభ్యుడిగా చేసి వారి కుటుంబీకులను టీడీపీలో ప్రాధాన్యత కల్పిస్తే వారు సైతం నమ్మకద్రోహం చేశారన్నారు. మరోవ్యక్తి వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి టీడీపీలోకి వెళ్లి ద్రోహం చేశారని, ఇలా నమ్మకద్రోహం చేసిన వ్యక్తులు స్నేహితులైనా బంధువులైనా క్షమించరాదన్నారు. విద్యా వ్యాపారం చేస్తున్న టీడీపీ నేత పొంగూరు నారాయణ నెల్లూరుకు చేసిందేమీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు కూడా అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, రాజకీయంగా ఎన్నో పదవులను ఇచ్చిన ఘనత కూడా ముఖ్యమంత్రికే దక్కుతుందని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. పద్మశాలి, దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లా డుతూ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ నెల్లూరును అభివృద్ధి చేస్తారనే నమ్మకం ప్రజలకు లేదన్నారు. ఆర్యవైశ్యుల రాజకీయ అభ్యున్నతికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేలా ఆర్యవైశ్యులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉచితంగా పథకాలు ఇస్తే రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని గగ్గోలుపెట్టిన చంద్రబాబు, ఎన్నికల సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాల కన్నా ఎక్కువ పథకాలు అమలు చేస్తానని హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

విష్ణువర్ధన్‌రెడ్డితో విజయసాయిరెడ్డి భేటీ



కావలి: అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అల్లూరులోని కాటంరెడ్డి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గంటన్నర పాటు చర్చలు జరిపారు. రానున్న ఎన్నికల పరిస్థితిని వివరించి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. భేటీ అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రజల పట్ల అంకితభావంతో సేవ చేయాలనే తపన వారి కుటుంబానికి ఉందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి కూడా ఆయన అనుచరులతో మరోమారు సమావేశమై, సీఎంను కలిసిన తరువాత తన నిర్ణయం తెలియజేస్తానన్నారు.

మహిళ దారుణ హత్య

- భర్తపై అనుమానాలు

కందుకూరు: బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్న మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం పట్టణంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళంకు చెందిన వనజాక్షి (27)కి కందుకూరు మండలం నరిశెట్టివారిపాలెంకు చెందిన చిమటా శివకృష్ణతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. గాయత్రీనగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకృష్ణ ఆటో నడుపుకుంటుండగా, వనజాక్షి ఇంటి వద్దే బ్యూటీపార్లర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పట్టణంలోని గుండంకట్ట ప్రాంతంలో వనజాక్షి తల్లిదండ్రులు నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం వనజాక్షికి తండ్రి నాగేశ్వరరావు ఫోన్ చేసినా తీయకపోవడంతో తెలుసుకునేందుకు కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వనజాక్షి నిర్జీవంగా పడి ఉండడంతో ఇరుగుపొరుగు వారిని పిలిచారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నఫీజ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో భార్యాభర్తలు గొడవ పడుతున్నట్లు గమనించామని, ఈ క్రమంలో భర్తే వనజాక్షిని చంపి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేశారు. భర్త శివకృష్ణ ఆచూకీ లేకపోవడం, ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానాలకు మరింత బలం చేకూరినట్లు అవుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.



ఇంట్లో చనిపోయిన వనజాక్షి

నేత్రపర్వంగా ‘రంగడి’ బంగారు గరుడసేవ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు సోమవారం స్వామివారికి తిరుమంజనం, పూజలు విశేషంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో, రాత్రి బంగారు గరుడసేవలో సర్వాలంకార శోభితంగా కొలువై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం పూలంగిసేవ వేడుకగా జరిగింది. మోహినీ అవతారం, బంగారు గరుడసేవల ఉభయకర్తలుగా సిద్ధవరపు శివకుమార్‌రెడ్డి, సనాతనరెడ్డి వ్యవహరించారు. పూలంగిసేవ ఉభయకర్తలుగా నాయుడు దశరథరామిరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు నాయుడు ఆదికేశవరెడ్డి, నారాయణరెడ్డి వ్యవహరించారు.



మోహినీ అలంకారంలో రంగనాథుడు

పొత్తు.. జనసేన చిత్తు

పాతాళానికి తొక్కేస్తున్న టీడీపీ

- నియోజకవర్గ ఇన్‌చార్జిలను పక్కన పెట్టిన వైనం
- పచ్చ కండువా వేసుకుంటే ప్రాధాన్యం ఇస్తామంటూ ఆఫర్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పొత్తు పేరుతో టీడీపీ జిల్లాలో జనసేన పార్టీ జెండా పీకేసే పనిలో ఉంది. క్యాడర్ అంతంత మాత్రంగా ఉన్న జనసేన పార్టీ ఉనికి నెల్లూరు, కావలిలో మాత్రమే కనిపిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను బరిలోకి దింపింది. ఈ దఫా ఎన్నికల నాటికి కావలి, నెల్లూరు సిటీ, రూరల్‌లో మాత్రమే నియోజకవర్గ స్థాయి లీడర్ల హడావుడి కొంత కనిపించింది. తాజాగా టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడంతో జిల్లాలో మిగతా నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ కేడర్ పూర్తిగా కనుమరుగైందనే చెప్పాలి.

పాతాళంలోకి పడిపోయి

గత సార్వత్రిక ఎన్నికల తర్వాత నెల్లూరు సిటీలో కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, నెల్లూరు రూరల్‌లో మనుక్రాంత్‌రెడ్డి, కావలి నుంచి అలహరి సుధాకర్ జనసేన పార్టీని కనిపెట్టుకుని కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉనికి చాటుకుంటూ వచ్చారు. అయితే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీకి మద్దతుగా నిలిచి పొత్తు పెట్టుకోవడంతో నెల్లూరు సిటీ నుంచి నారాయణ టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారని గ్రహించిన కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తన భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. దీంతో మనుక్రాంత్‌రెడ్డి నెల్లూరు రూరల్ నుంచి సిటీకి మారిపోయారు. పొత్తులో భాగంగా నెల్లూరు సిటీ నుంచి తనకు అవకాశం వస్తుందని భావించిన మనుక్రాంత్‌రెడ్డి సిటీ పరిధిలో డివిజన్ల వారీగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేశారు. పార్టీ కార్యాలయాలను కూడా ప్రారంభించారు. అయితే నెల్లూరు సిటీ నుంచి టీడీపీ అభ్యర్థిగా నారాయణ పేరు ఖరారు కావడంతో కనీసం నెల్లూరు రూరల్ సీటు అయినా వస్తుందని ఆశించిన మనుక్రాంత్‌కు భంగపాటు తప్పలేదు. దీంతో పార్టీ క్యాడర్ సైతం చెల్లాచెదురై పరిస్థితి పాతాళానికి పడిపోయింది. మిగతా నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జిలు ఉన్నప్పటికీ టీడీపీ అభ్యర్థులు వారిని కనీసం దరిచేరనీయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీతో కలిసి పనిచేయడం అవసరమా? అని లోలోన మదన పడుతున్నారు.



ఎన్నికల తర్వాత గ్లాసు కనిపించేనా..

ప్రస్తుతం జిల్లాలో 8 నియోజకవర్గాలు ఉన్నప్పటికీ పొత్తులో భాగంగా ఒక్క స్థానం కూడా జనసేనకు కేటాయించలేదు. అయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు టీడీపీ విజయం కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా.. టీడీపీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా జనసేన జెండా పీకేసేందుకు కంకణం కట్టుకున్నారు. నెల్లూరు సిటీలో టీడీపీ అభ్యర్థి నారాయణ తన బినామీ అయిన గునుకుల కిషోర్‌ను జనసేనలోకి పంపి ఆయన్ను ముందుంచి మనుక్రాంత్‌రెడ్డిని ఎన్నికల క్షేత్రంలో లేకుండా చేశారు. నారాయణ తన పార్టీ కేడర్‌తో జనసేన జెండాలు మోయిస్తూ ఆ పార్టీని దాదాపు లేకుండా చేశారు. కావలిలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అలహరి సుధాకర్ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి కోసం పనిచేస్తున్నారు. అయితే కావ్య కృష్ణారెడ్డి తనదైన ధోరణిలో జనసేన క్యాడర్‌ను టీడీపీ కండువా కప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు అలహరి సుధాకర్ ఇటీవల నాగబాబు, నాదెండ్ల మనోహర్‌లను కలిసి గోడు వెళ్లబోసుకున్నారని తెలిసింది. జిల్లాలో ఎక్కడైతే జనసేన ఉనికి ఉందో అక్కడ ఆ పార్టీ క్యాడర్‌ను సైతం టీడీపీలో కలిపేసుకుని ఆ పార్టీ జెండా పీకేసే పనిలో పచ్చనేతలు నిమగ్నమయ్యారు. ఇదంతా టీడీపీ అధినేత సూచనల మేరకే జరుగుతున్నట్లు సమాచారం. ఇదే జరిగితే సార్వత్రిక ఎన్నికల తర్వాత జనసేన జెండా కనిపించకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్‌రీల్

ఎంసీసీ ఉల్లంఘనపై కేసు నమోదు



చిన్నబజారు పోలీసుస్టేషన్ వద్ద సీజ్ చేసిన వాహనం

నెల్లూరు(క్రైమ్): ఎంసీసీ ఉల్లంఘనపై చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి. సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా నగరంలోని విరాట్‌నగర్‌లో కొణిదల విజయం.. కొట్టే లక్ష్యం అని, పవన్‌కళ్యాణ్ ఫొటో, స్టిక్కర్లు అతికించి ఉన్న ఇన్నోవా (ప్రచార) వాహనాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు గుర్తించారు. సదరు వాహన డ్రైవర్ ఎలాంటి అనుమతి పత్రాలు లేవని చెప్పడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి దామోదరరావు ఫిర్యాదు మేరకు ఎంసీసీ ఉల్లంఘనపై స్థానిక ఎస్సై లతీఫున్నీసా కేసు నమోదు చేశారు.

కామర్స్, బోటనీ, జువాలజీ మూల్యాంకనం 27కి మార్పు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి కామర్స్, బోటనీ, జువాలజీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 27వ తేదీకి మార్పు చేసినట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనానికి హాజరయ్యే అధ్యాపకులకు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఈ విషయం తెలియజేసి వారిని మూల్యాంకనం క్యాంపులో రిపోర్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్సవమూర్తులకు అభిషేకం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి తిథి సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం గరుడసేవ గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు, విశేష పూజలు ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. నెల్లూరు వాస్తవ్యులు ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానం పుష్పయాగం

- సుమగంధాలతో పరిమళించిన బిలకూటం



బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన పుష్పయాగం శోభాయమానంగా సాగింది. వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన విశేష పుష్పాలతో అర్చకులు యాగం ప్రారంభించారు. మేలుజాతి గులాబీలు, తామర, చామంతి, జాజి, విరజాజి, కలువలు, పొన్న, పొగడ, సంపంగి, మల్లెలు, మరువం, దమనం, వట్టివేర్లు, హరిత, హరిద్ర, బిల్వ, కస్తూరి, కనకాంబరాలు, మొగలిరేకులు, బంతి తదితర పూలతోపాటు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళాలతో నేత్రపర్వంగా పుష్పయాగం నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా సాగిన యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మనుగడ కోసమే చంద్రబాబు పొత్తులు


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనతో చంద్రబాబుకు దిక్కు తోచడం లేదు. అందుకే రాజకీయ మనుగడ కోసం జనసేన, బీజేపీతో అవకాశవాద పొత్తులు పెట్టుకున్నాడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇవే పార్టీలు 2014లో కలిసి పోటీ చేశాయన్నారు. అప్పుడు బాబు 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడన్నారు. రుణాల మాఫీ పేరుతో రైతులు, పొదుపు మహిళలను నట్టేట ముంచాడన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశంను బంగాళాఖాతంలో కలిపి వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పదవీ కాలంలో ప్రతి హామీని నెరవేర్చినట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగించారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు చేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు అవకాశవాద పొత్తులతో సిద్ధమయ్యాడన్నారు. గత టీడీపీ పాలన, ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజు వేసుకుని ఓట్లు వేయాలని కోరారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపించే టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మరోసారి ఓటమి తప్పదని కాకాణి జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీటీసీ గుండాల చందన, సర్పంచ్‌లు తూపిలి వెంకటరమణయ్య, యూఎస్‌కే రెడ్డి, బందెల వేణుగోపాల్, నేతలు కసిరెడ్డి ధనుంజయరెడ్డి, గుండాల ఆదినారాయణ, సన్నారెడ్డి జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ప్రజలకు అండగా ఉంటా


వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న ఆదాల, చిత్రంలో మేయర్ స్రవంతి, మలిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. 19వ డివిజన్ గోమతి నగర్‌లో దువ్వూరు అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లో ఉన్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. 19వ డివిజన్ నాయకుడు కొండేటి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసులు, డి.రవీంద్రారెడ్డి తదితరులు వారి మిత్రబృందంతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, నాయకులు కోటేశ్వరరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, రావు శ్రీనివాసరావు, స్వర్ణా వెంకయ్య, లంక శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.55 లక్షల స్వాధీనం

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న రూ.1.55 లక్షల నగదును ఎన్నికల సిబ్బంది, వలేటివారిపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని పోలినేనిచెరువుకు సంబంధించిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి కారులో రాజంపేట నుంచి వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. రూ.1,55,000 నగదు రవాణాకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నగదును ట్రెజరీ కార్యాలయంలో జమ చేశారు.

రికార్డుల పరిశీలన


సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికల్లో నేపథ్యంలో మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సమీపంలోని నెల్లూరు – ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం కావలి డీఎస్పీ వెంకటరమణ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ చెక్‌పోస్టులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ వెంట ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, ఎస్సై కె.తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

పనికి వెళ్తుండగా..

- వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరం శివారు ప్రాంతంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుమ్మరగిరి నరసింహులు (40) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నరసింహులు జామాయిల్ తోటలో కాపరిగా ఉంటున్నాడు. పనికి వెళ్తుండగా వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో రూ.8.61 లక్షల చోరీ

కోవూరు: పెళ్లకూరు కాలనీ సమీపాన ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.8.61 లక్షల నగదు, 37 మద్యం బాటిళ్లను చోరీ చేశారు. బ్యాంకులకు సెలవులు కావడంతో సిబ్బంది నగదును కౌంటర్‌లో పెట్టారు. ఆదివారం రాత్రి దుకాణం మూసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలుగొట్టి ఉన్నాయి. కోవూరు సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్సై రంగనాథ్‌గౌడ్, సెబ్ అధికారులు దుకాణానికి చేరుకుని పరిశీలించారు. వాచ్‌మెన్ మల్లికార్జునను విచారించగా తెల్లవారుజాము ఐదు గంటల వరకు ఉన్నానని, తర్వాత ఏమి జరిగిందో తెలియదని చెప్పాడు. దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'తెలుగుదేశాన్ని ప్రజలు నమ్మడం లేదు'

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: 'ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంతో నమ్మకం ఉంది. వారంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. అధికారం కోసం అబద్ధపు హామీలతో మాయ చేసే టీడీపీని నమ్మే పరిస్థితి లేదు' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు ఇన్‌చార్జి పోతనబోయిన వేణు, పులి చక్రపాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు వస్తుండటంతో కావ్య కృష్ణారెడ్డి భయపడుతున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కాగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు లభిస్తున్న ప్రాధాన్యం, సంక్షేమ పథకాలు అందడం తదితరాలను చూసి పార్టీలో చేరామన్నారు.

ఉదయగిరిలో భారీ మెజార్టీ రావాలి

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి మండలంలో వైఎస్సార్‌సీపీకి 9 వేల మెజార్టీ రావాలని, అందుకోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఉదయగిరిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నేతలతో మాట్లాడారు. 40 సంవత్సరాల నుంచి ఉదయగిరి అభివృద్ధికి మేకపాటి కుటుంబం ఎంతో కృషి చేస్తోందన్నారు. పట్టణంలో మెరిట్స్ ఇంజినీరింగ్ కళాశాల స్థాపన, డిగ్రీ కాలేజీ ఏర్పాటు, దుత్తలూరు – సీతారామపురం జాతీయ రహదారి సాధన మేకపాటి కుటుంబీకుల ద్వారానే జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఎంతో లబ్ధి చేకూర్చారన్నారు. అందరూ కష్టపడి పార్టీకి భారీ మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, నేతలు మూలె వినయ్‌రెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, వీరారెడ్డి, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 135	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ (లైవ్)	: 73		
బ్రాయిలర్ చికెన్	: 240	లేయర్ చికెన్	: 125



ఓటరు సహాయక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్


కేంద్రాల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

ఉలవపాడు: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో ఓటరు సహాయక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మండల పరిధిలోని కరేడు జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహాయక కేంద్రం ద్వారా ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని సులువుగా వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సెక్టోరల్ అధికారులు వీటి ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేసవి కాలం నేపథ్యంలో టెంట్లు ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల రాకపోకల కోసం ర్యాంపులను ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జాతీయ రహదారిపై మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును సందర్శించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్, కందుకూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విద్యాధరి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రారెడ్డి, సెక్టోరల్ అధికారి పీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కంట్రోల్ రూం పరిశీలన

కందుకూరు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టర్ హరినారాయణన్ సోమవారం పరిశీలించారు. సీ విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ విండో పర్మిషన్ సెంటర్‌ను సందర్శించి అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా టీంల పనితీరును పరిశీలించి అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్వో విద్యాధరి, తహసీల్దార్ ప్రేమ్ చంద్రారెడ్డి, సెక్టోరల్ అధికారి పీవీ రమణయ్య ఉన్నారు.

పచ్చమీడియా సహకారంతో జగన్‌పై దుష్ప్రచారం

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: 'ప్రతిపక్షాలు పచ్చమీడియా సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నాయి. సంక్షేమాన్ని అందుకున్న ప్రతి ఒక్కరూ ఓటుతో గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైంది' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బెడుసుపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకురావడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి అభివృద్ధిలోకి వచ్చిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఆయన తనయుడు జగన్ విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టి అందరూ చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. అదే విధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందజేయడం జరిగిందన్నారు. మీ ఇంటికి సంక్షేమ పథకాలు అంది ఉంటేనే ఓటు వేయాలని జగన్ కోరారని, ఆయనకు అండగా ఉండాలన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, నాయుడు హజరత్‌రెడ్డి, రమణ, రామ్మోహన్‌రెడ్డి, హరిబాబు, ఖాన్‌సా తదితరులు పాల్గొన్నారు.

1,267 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 524 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. వివిధ కారణాలతో 63 బేళ్లను తిరస్కరించారన్నారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.230, కనిష్టంగా రూ.220, సరాసరిన రూ.228.02 ధర లభించిందన్నారు.

- **మర్రిపాడు:** మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 743 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 93,254 కిలోల పొగాకును కొనుగోలు చేశారన్నారు. కిలోకు గరిష్టంగా రూ.230, కనిష్టంగా రూ.220, సగటున రూ.228.70 ధర లభించిందన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


సురేష్ మృతదేహం

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడిని వైఎస్సార్ జిల్లా ఖాజీపేటకు చెందిన వలస కూలీ సురేష్ (28)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.77
సన్నవి : రూ.68
పండ్లు : రూ.25

